ఓపెన్ జిమ్‌లు.. అధునాతన హంగులు

- పార్కుల్లో ఆహ్లాదం.. ఆరోగ్యం
- ఫిట్‌నెస్‌పై నగరవాసుల దృష్టి


51వ సిద్ధార్థపార్కులో ఓపెన్ జిమ్

మద్దిపాలెం: ఓ మనిషికి ఆరోగ్యం ఎంత ముఖ్యమో మనసుకు ఆహ్లాదం కూడా అంతే అవసరం. అయితే కొందరు సమయానుసారం వాకింగ్ చేసి, జిమ్‌లకు వెళ్లి ఆరోగ్య సూత్రాలు పాటిస్తారు. వాకింగ్‌కు వెళ్లాలంటే ప్రధానంగా ఆసక్తి ఉండాలి..దాంతోపాటు సమయం కూడా ఉండాలి. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి వార్డులోనూ పార్కులను అభివృద్ధి చేశారు. అందులో భాగంగానే ప్రతి పార్కులో జీవీఎంసీ అధికారులు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే 51, 53వ వార్డులో పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. 51వ వార్డు మాధవధార, వుడా కాలనీ, కళింగనగర్‌లలో సిద్ధార్థపార్కు, సెంట్రల్ పార్కు, ఈస్ట్‌పార్కు, ఎంఎన్ఆర్ పార్కు పద్మావతి పార్కు ,అలాగే 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్‌లో ఓపెన్ జిమ్, ఎఫ్‌సీఐ నగర్‌లో ఎఫ్‌సీఐ పార్కులో పార్కు డెవలప్‌మెంట్‌లో భాగంగా ఓపెన్ జిమ్‌లు, పిల్లలు ఆడుకునే పరికరాలు వంటివి డెవలప్ చేశారు. ఇలా చేయడం వల్ల పార్కుల్లో వాకర్స్ .. వ్యాయామం చేసే వాళ్ల సంఖ్య పెరిగింది. ఒకప్పుడు రహదారులపైనే వాకింగ్ చేసేవారు. రోడ్డుపై నడవడంతో ప్రమాదాలు జరుగుతాయేమో అని భయపడేవారు.ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చిన్న పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారు పార్కుల్లో ఆహ్లాదంగా గడుపుతున్నారు.

ముఖ్యంగా మహిళలు ఒకప్పుడు ఇంట్లో పనితోనే సరిబెట్టుకునే మహిళలు ఆసక్తిగా కాసేపు వ్యాయాయం చేయడానికి, వాకింగ్ చేయడానికి, కబుర్లు చెప్పుకోవడానికి పార్కులకు వస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఏదో ఒక సమయంలో ఇలా వ్యాయామం చేస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో గడుపుతున్నారు. ప్రతి పార్కుకి సుమారు రూ.5 నుంచి 10 లక్షలు వెచ్చించి జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. పార్కు సైజు బట్టి వాకింగ్ ట్రాక్,జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు.

జిమ్‌లో పరికరాలు ఇవే..

జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో హిప్ రొటేటర్, స్టమక్ రొటేటర్, సైక్లింగ్, కాలి ఉయ్యాల, హ్యాండ్ రొటేటర్ వంటి పరికరాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. చిన్న పిల్లల కోసం మరికొన్ని పరికరాలు ఏర్పాటు చేశారు. దీంతో పార్కుల్లో సందడి వాతావరణం నెలకొంది.

ఇది కదా అభివృద్ధి

51వ వార్డులో ఉన్న జిమ్‌లు : మాధవధార, వుడా కాలనీ, కళింగనగర్‌లలో సిద్ధార్థపార్కు, సెంట్రల్ పార్కు, ఈస్ట్‌పార్కు, ఎంఎన్ఆర్ పార్కు పద్మావతి పార్కు

53వ వార్డులో: జాకీర్ హుస్సేన్ నగర్‌లో ఓపెన్ జిమ్, ఎఫ్‌సీఐ నగర్‌లో ఎఫ్‌సీఐ పార్కులో పార్కు

జిమ్‌లకు వెచ్చించిన నిధులు (ఒక్కో పార్కులో): రూ.5 నుంచి 10 లక్షలు

జిమ్‌లో పరికరాలు: హిప్ రొటేటర్, స్టమక్ రొటేటర్, సైక్లింగ్, కాలి ఉయ్యాల, హ్యాండ్ రొటేటర్



51వ వార్డు ఈస్ట్‌పార్కు మెయిన్ గేట్


కళింగనగర్ వద్ద ఎంఎన్ఆర్ పార్కులో జిమ్


53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ వద్ద ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న స్థానికులు

ఎంతో ఉపయోగం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధిలో భాగంగా జీవీఎంసీ అధికారులు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. బయట జిమ్‌లకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని. అందరూ వెళ్లలేరు. ఇలా ఏర్పాటు చేయడం వల్ల చాలా మంది ఓ అరగంట సేపు వ్యాయామం చేసుకుంటున్నారు. మానసిక ఉల్లాసం, ఫిజికల్ ఫిట్‌నెస్‌కు అవకాశం ఏర్పడింది.

–శ్రీనివాసరావు, జాకీర్ హుస్సేన్‌నగర్ ,53వ వార్డు

జిమ్‌లు బాగున్నాయి



నేను మద్రిపాలెంలో వుంటాను..సమయం దొరికినప్పుడల్లా ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసుకుంటాను. నా స్నేహితులు కూడా వస్తారు. దీని వల్ల బయట జిమ్‌కు వెళ్లనక్కరలేదు. డబ్బు, సమయం రెండూ ఆదా అవుతున్నాయి. ఆనందంగా వుంది.

–సీహెచ్ గౌతమ్‌ప్రసాద్, మద్రిపాలెం

క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులోని సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. హైవే సాయినగర్ నుంచి మద్రిపాలెం మెయిన్‌రోడ్డుకు వెళ్లే మసీద్ స్ట్రీట్ రోడ్డులో జరుగుతున్న పనులను వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ పరిశీలించారు.అనంతరం వారికి తగు సూచనలు చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్


విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలమణి

సీతమ్మధార : మండలస్థాయి సైన్స్ ఫేర్ పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ హైస్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో-2 బాలమణి పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన 17 ప్రాజెక్టులను పరిశీలించారు. రోలింగ్ స్పీడ్ బ్రేకర్స్ అనే అంశంలో ఎస్ఎంసీహెచ్ స్కూల్‌కు ప్రథమ స్థానం లభించింది. వ్యక్తిగత విభాగంలో పార్ట్స్ ఆఫ్ ఏ సర్కిల్ అనే అంశంలో కెఎస్ఎం బాలికల స్కూల్ (న్యూకాలనీ) మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థులబృందంగా కలిసి రూపొందించిన ఆర్గానిక్ వరల్డ్ అనే అంశానికి సంబంధించిన ప్రాజెక్టును మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో హెచ్‌ఎంకే రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.75 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం


పనులను ప్రారంభిస్తున్న మేయర్ వెంకటకుమారి, సమన్వయకర్త కేకే రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్, లలితానగర్‌లో రూ. 75 లక్షల వ్యయంతో బీటీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం చాకలిపేటలో వార్డు ఇంచార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఈ శ్రీనివాసరాజు, ఏఈ నిహారిక, కార్పొరేటర్ శ్రావణి, వార్డు నాయకులు రేవతిరావు, శేషు, నవాబు, హరి, అమ్మాజి, విజయ్‌పాల్ , సచివాలయ కన్వీనర్లు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్ ముందు ధర్నా చేశారు. మంగళవారం రైల్వేస్టేషన్ వద్ద విజయదుర్గ ఆటో ఓనర్ కం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ ప్రజా ఆస్తులైన విశాఖ స్టీల్ ప్లాంట్, బ్యాంకులు, పోర్టులు, హార్బర్లు, ఎల్ఐసీ ఇలా ప్రతీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇటువంటి నిర్ణయాలను విరమించుకోవాలని హెచ్చరించారు.

పెన్షనర్ల హక్కుల కోసం పోరాటం


ప్రాంతీయ సమావేశం వివరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్: హార్బర్-పోర్టు పెన్షనర్ల హక్కుల సాధనకు సమైక్యంగా పోరాడుదామని హార్బర్-పోర్టు పెన్షనర్ల అసోసియేషన్ తీర్మానించింది. సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మినీ జనరల్ బాడీ సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముంబాయి, గోవాల్లో నిర్వహించిన పెన్షనర్ల సబ్ కమిటీ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈనెల 24న మాధవదార తోటలో వనసమారాధనతో పాటు సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు.

పాఠశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ భాస్కరరావు వు, పాఠశాల డైరెక్టర్ సునీత

తాటిచెట్లపాలెం: ఆసియాలో అతిపెద్ద ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఎక్స్‌పోలో ప్రతిష్టాత్మక బ్రెయిన్‌ఫీడ్ మ్యాగజైన్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డును విశాఖపట్నంలోని తాటిచెట్లపాలెంకు చెందిన విశ్వతేజ స్కూల్‌కు దక్కింది. అకాడమిక్ ఎక్స్‌లెన్స్‌లో అత్యుత్తమ పాఠశాలగా ఈ పాఠశాల ఎంపికైంది. పాఠశాలలో అందిస్తున్న విద్య, పాటిస్తున్న ప్రమాణాలను, వనరులను పరిశీలించిన బ్రెయిన్‌ఫీడ్ ప్రతినిధులు ఈ అవార్డును ఈ పాఠశాలకు అందజేసినట్లు స్కూల్ ప్రిన్సిపల్ భాస్కరరావు తెలిపారు. ఈ అవార్డును ఇటీవల హైదరాబాద్‌లో సంస్థ ప్రతినిధులచే స్కూల్ యాజమాన్యం అందుకుంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఐ.సునీత కూడా పాల్గొన్నారు. ఈ అవార్డు రావడానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఇంటింటికీ వెళ్లి పథకాల ప్రచారం


పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు 289 సచివాలయం పరిధి కళింగనగర్ లోని సచివాలయ కన్వీనర్ రాణితో కలిసి మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు రామకృష్ణ,లక్ష్మి,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం


పార్టీ జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 307,308 సచివాలయాల పరిధి జ్యోతినగర్ స్కూల్ వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజని ఈశ్వర్రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఈ సచివాలయం పరిధిలో ఇంతవరకు జరిగిన అభివృద్ధిని తెలియజేసే డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభనుద్దేశించి కేకే రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుల కృష్ణారావు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 54వ అర్డు నాయకులు కె చిరంజీవి, అచ్చుతరావు, రమణమ్మ, లాయర్‌ప్రసాద్, జగదీష్, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, గృహసారథులు, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేకే రాజు

50వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

మద్రిపాలెం: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు 278 సచివాలయం పరిధి వర్మ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు నాయకులు బగాది విజయ్, ఏవీఎన్ రాజు, సనపల నారాయణ స్వామి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు
- 3,600 మందికి స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

మద్రిపాలెం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ వైపు రాష్ట్రం అడుగులు వేస్తోందని, ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. మంగళవారం నియోజకవర్గస్థాయిలో 53వ వార్డు శివనగర్ వద్ద ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి 3,600 మందికి స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా మరింత మెరుగ్గా అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5లక్షలుగా వున్న కార్డు పరిమితిని రూ.25లక్షలకు పెంచారని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.వెయ్యి దాటిన నుంచి ఆపైన రూ.25లక్షల వరకు దేశంలో ఎక్కడైనా చికిత్స చేయించుకోవచ్చన్నారు. క్యాన్సర్ మహమ్మారి వంటి రోగాలకు కూడా కార్డు ద్వారా చికిత్స పొందవచ్చన్నారు. అలాగే ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నంతకాలం వారికి ఉచిత భోజన సదుపాయం కూడా వుంటుందన్నారు. డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చిన తర్వాత కూడా వారికి ఉచిత మందులతో పాటు జీవనోపాధి కోసం రోజుకు రూ.225 చొప్పున కోలుకునేంతవరకు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కొత్త ఫీచర్స్‌తో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్నారని, అంతేకాక ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సిబ్బంది మరింత అవగాహన కల్పిస్తూ స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నారని అన్నారు. ప్రతి కార్డులో క్యూఆర్ కోడ్‌తో పాటు లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాలను కూడా పొందుపరిచారని తెలిపారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్‌లో లబ్ధిదారుడి ఆరోగ్య వివరాలతో కూడిన ఐడీ నంబర్ కూడా వుంటుందని తెలిపారు. ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసి వారి వివరాలు తెలిసేలా వలంటీర్లను, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, అటవీ శాఖ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి, సీఎంహెచ్‌ఓ సునీల్, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, డైరెక్టర్ ఐ.రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి, 53వ వార్డు నాయకులు షేక్ బాబ్జి, సదరం జ్ఞానేష్, బూస రామలక్ష్మి, జ్యోత్స్న, హనుమంతు, అన్సర్ వలీ, సత్యారావు, అలీ, రామారావు, రామశాస్త్రి, బాలాజీ పాల్గొన్నారు.


స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను అందిస్తున్న కేకే రాజు తదితరులు

నష్టపరిహారం చెక్కుల అందజేత


చెక్కులను అందిస్తున్న కేకే రాజు, రెయ్యి వెంకటరమణ తదితరులు

మద్రిపాలెం: రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు, షాపులు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెక్కులు అందజేశారు. ఈ మేరకు జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ-3 ప్రాంతంలో రోడ్డు విస్తరణలో భాగంగా 287 సచివాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం చెక్కులను మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన వుంటుందన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ రామకృష్ణ, మెట్ట దమయంతి తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో క్రిస్మస్ సంబరాలు


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఏయూ క్యాంపస్: ఏపీ ఈపీడీసీఎల్‌లో ఉద్యోగులు మంగళవారం క్రిస్మస్ వేడుకలను పవర్ ఎంప్లాయిస్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ ఇమ్మడి పాల్గొని కేక్ కట్ చేసి, ఉద్యోగులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఏసు అందించిన సందేశం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సీజీఎంలు వి.విజయలలిత, ఎస్.ఎం.మణి, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్ర ప్రసాద్, జీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజారావుకు ఎన్విరాన్‌మెంటలిస్ట్ అవార్డు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ విభాగంలో సహాయ ఆచార్యుడు(కాంట్రాక్ట్)గా పని చేస్తున్న డాక్టర్ జి.రాజారావుకు నేషనల్ ఎన్విరాన్‌మెంటలిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ 2023 సంవత్సరానికి రాజారావుకు ఈ అవార్డును బహూకరించింది. ఈ సందర్భంగా ఆయనను ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.

యోగా కేంద్రంలో ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం, రోటరీ క్లబ్ సంయుక్తంగా మంగళవారం బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో ప్రత్యేక ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ ప్రారంభించారు. 160 మందికి పైగా ప్రజలు తమ సమస్యలకు చికిత్స పొందారు. యోగా కేంద్రం బోధన సిబ్బంది డాక్టర్ తులసీరావు, డాక్టర్ చిట్టూరి శ్రావణి శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య భానుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సింహగిరికాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాన చేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సింహగిరికాలనీలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు శంకుస్థాపన చేశారు. ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వంలో గమనించిన పలు పనులకు సంబంధించి ఈ శంకుస్థాపన చేశారు. ఈ కాలనీలో సీసీ డ్రైనేజీలు, మెట్లు నిర్మాణానికి సుమారు రూ.10లక్షలు మంజూరైనట్టు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ ఉమామహేశ్వర్రావు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు రాజుయాదవ్, బాబూరావు, దుర్గ, నాయుడు, ఈశ్వర్, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బుంది, స్థానిక కాలనీ నాయకులు పాల్గొన్నారు.